AIJRELPLS VOLUME 6, ISSUE 1 (2021, JAN/FEB) (ISSN-2456-3897)ONLINE
Anveshana's International Journal Of Research In Education, Literature, Psychology And Library Sciences

# వరంగల్ జిల్లాలో మారిన గ్రామ నామాలు

**కోర్గు సత్యనారాయణ, పరిశోధక విద్యార్థి**

**చరవాణి : 9177664447**

**తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వ విద్యాలయం**

**మట్టెవాడ** మట్టెవాడ పూర్వం కాకతీయుల రాజధానికి ముఖ్యమైన అంగళ్లస్థానము.

మటియ (సంత) – అంటే క్రయ విక్రయాదులకు తేబడిన సరుకులు.

అట్టి సరుకులుండే చోటు మటియవాడు. అదే నేటికీ మట్టెవాడగా పిలువబడుచున్నది. ఇది వ్యాపార స్థలం. స్థానిక వ్యాపారులు అచట శ్రీ వీరభద్రేశ్వర దేవుని ప్రతిష్ఠించి, ఆలయం కట్టించి, దాని నిర్వహణార్థం, మటియలో వ్యాపారం చేసేందుకై వచ్చి పోయే సరుకులపై కొంత చందాలు నిర్ణయించారు. దీనికి గణపతి దేవుని అనుమతి పొందారు. (జిల్లా సర్వస్వము – డా॥ గుంజి వెంకటరత్న పుట : 161)

**హనుమకొండ (రాష్ట్రకూటుల) :** జైనారామం గల కొండయగుటచే ఈ నగరాన్ని ఆరామకొండ లేక అర్మకొండయని పిలిచేవారు. బయ్యారం శాసనంలోని కథనం ప్రకారం కాకతి మొదటి బేతరాజు అనుమడు, కొండడు అనే నాయకులను జయించి అనుమకొండకు రాజైనట్లు తెల్పుతుంది. ఆరామకొండ – అర్మకొండగా – అమ్మకొండ – అన్మకొండ – అనుమకొండ – హనుమకొండగా మారొచ్చు గాని కాకతీయులు శైవులయినప్పటి నుండి దీన్ని అన్మకొండ అని పిలుచుట ప్రారంభమైనట్లు తెలుస్తుంది. దర్గాశాసనంతో దీన్ని అన్మకొండ అని పేర్కొన్నారు. కాని అర్మకుణ్ణయని కూడా కొన్ని శాసనాలలో కన్పిస్తున్నది. చివరకు అన్మకొండ అను పేరు స్థిరపడింది.

**కొండపర్తి :** పొలమెయరట్టోడి అనే స్థానికాధికారి మంచికాళుకొడుకైన కొణ్ణపకు చెరి సమానముగ పాలికి సేద్యము చేయునట్లు ఏర్పాటు చేసిన భూమి యిది అట్లని తాంబూల స్వీకారము చేయబడును.

కూన్తుకున్తుల అంటే బిడ్డబిడ్డ తరమున వరువదివడ్డి అంటే వ్యవసాయ పర్వదినమునాడు చెల్లించు పన్ను చెల్లించి సేద్యము (ఏటేటా) ఆరంభం చేయువారు.

భూమిలో సేద్యమునకు దిగునపుడు ముందుగ భూస్వామికి కొంత చెల్లించవలెను. పంట వచ్చిన తర్వాత అదికొంత చెల్లించవలెను. పూర్వం యిట్టి విధానం నిర్ణయము చేసుకొనునపుడు కూడ అందుకు సంబంధించిన వారు తాంబూల గ్రహణము చేసి తామా నిర్ణయమునకు కట్టుబడి యుందుమని అంగీకరించుట ఇది ఆయా పక్షముల వారెవ్వరు తప్పకూడదని కట్టడి (విజ్ఞాన సర్వస్వం – పుట. 167)

**మాటౌడు :** మాటౌడు గ్రామాన్ని పూర్వం మాటూరు అని వ్యవహరించేవారు. ఈ ప్రాంతంలో అంతకు పూర్వమే వందల ఎకరాల విస్తీర్ణంలో త్రవ్వించిన మైలసముద్రమనే పేరుగల చెరువుంది. చెరువు కింద ప్రవహించే నీరు ఒక చోట నిలువ ఉండే మడుగులాంటి దాన్ని "మాటు" అనడం తెలంగాణ పల్లెలో ఉంది. ఇలా ఏర్పడిన మాటుకు సమీపంలో ఉన్న గ్రామం కాబట్టి ఈ ఊరికి మాటేడు, మాటూరు అని వ్యవహారంలోకి వచ్చి ఉండవచ్చు. ఇక్కడ దేవాలయ నిర్మాణానికి సమకూరిన ద్రవ్యంలో మిగిలిన దానిని చెరువులా మధ్యలో భూనిక్షప్తంచేశారని స్థానికులు చెబుతున్నారు. అందుకే చెరువు మధ్యలో ఎత్తుగా ఉన్న ప్రదేశాన్ని నేటికి 'ధనపుడ్డ'గా పిలుస్తున్నారు.

**డోర్నకల్ :** ప్రస్తుత గార్ల మండలం మర్రిగూడెం, బుద్ధారం గ్రామ పంచాయతీల శివారులోని వేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో కాకతీయ చక్రవర్తుల పరిపాలనా కాలంలో బ్రహ్మోత్సవాలు మహావైభవంగా జరిగేవి. ఈ బ్రహ్మోత్సవాలకు మర్రిగూడెం బుద్ధారం గ్రామాలను కలుపుతూ మామిడి తోరణాలు కట్టేవారట. ఈ తొరణాలకు సరిపడా మామిడాకులను ఈ రెండు గ్రామాల మధ్యలో ఉన్న మామిడి తోటలో నుంచి తెచ్చేవారు. తోరణాలకు సరిపడా ఆకులు లభించే ప్రాంతం కాబట్టి ఈ ప్రదేశాన్ని 'తోరణాకుల' అనిపిలిచేవారు. కాలక్రమేణా అక్కడ ఉన్న ఆ గ్రామం పేరే తోరణాకులగా కానీ, లేదా ఆ ప్రదేశంలో కొత్తగా ఒక ఊరు వెలసి దానికి 'తోరణాకుల'గా గానీ పేరొచ్చి ఉండొచ్చు. అది కాస్త తోరణాకుల – డోరణాకుల – దోరణకాలు – దొరణకల్లు అయి ఉంటుంది. ఈ పేరు ఇంగ్లీషు వ్యవహారంలో 'ద', 'డ'గా మారి డోర్నకల్లుగా స్థిరపడి ఉండవచ్చు.

**బయ్యారం :** కాకతీయ చక్రవర్తులలో సుప్రసిద్ధుడయిన గణపతిదేవ చక్రవర్తి చెల్లెలు మైలాంబ. ఆమె తన తల్లి బయ్యాలదేవి పేర నిర్మించిన గ్రామం ఈ బయ్యారం. 750 సం॥రాలకు పైగా చరిత్ర ఉన్న గ్రామం.

**గీసుకొండ :** అతి ప్రాచీన చరిత్ర కల్గిన గ్రామం. వరంగల్‌కి 10 కి.మీ. దూరంలో ఉంది. గ్రీకులు ఇక్కడ స్థావరాలు ఏర్పాటు చేసి వర్తక వాణిజ్యాలు సాగించారని ఇక్కడ దొరకని గాంధార శిల్ప కళను పోలినట్టి బొమ్మలు లభ్యంగా కావడాన్ని బట్టి తెలుస్తుంది. గ్రీకు దేశస్థుల స్థావరమే నేటి గీసుకొండగా మారింది.

గ్రీకుకొండ – గ్రీసుకొండ – గీసుకొండ.

**అన్నారం షరీఫ్ :** పర్వతగిరి మండలంలో గలదు అన్నవరం కాల క్రమంలో అన్నారంగా మారింది. ఇక్కడ పూజలందుకుంటున్న యాకూబ్ ప్రావలీ గురించి కొన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి. ఈయన మదీనాలో వ్యాపారవేత్త. ఇతని చెల్లెలు మహబూబి, సోదరులు హజరల్ గుంపాప్రవలి, హజరల్ భోలేప్రావలి యాకూబ్ పాప్రవలి సహజంగా దయార్ద్ర హృదయం గలవాడు. ఆధ్యాత్మిక చింతన కూడా అధికం. వ్యాపారంలో సంపాదించిన ధనాన్ని పేదలకు సహాయం చేసేవాడు. కొంత కాలం తర్వాత అప్పుల పాలైనాడు. మదీనా నుండి సోదరితో కలిసి భారతదేశం పారిపోయివచ్చాడు. అయినా అప్పులిచ్చిన వాళ్ళు వెంటాడుతుండడంతో యాకూబ్ పాప్రవలి అన్నారం ప్రాంతం చేరి అక్కడి చెరువు తూములో దాక్కున్నాడు. అక్కడే పాప్రవలి జీవసమాధి అయిందు. అప్పటి నుండి ఆ ప్రాంతంలో యాకూబ్ పాప్రవలి దర్గా వెలసింది. సోదరి, సోదరులు కూడా అక్కడే జీవసమాధి అయినారు. వారి సమాదులు కూడా అక్కడే ఉన్నాయి.

హిందూ, ముస్లింలు కలిసి పాల్గొనే పవిత్రక్షేత్రం అన్నారం షరీఫ్. ఇక్కడి మొక్కుబడుల్లో కందూరు ముఖ్యమైంది.

**కుందారం :** గణపతిదేవుని చెల్లులు. కాకతీయుల ఆడపడుచు కుందమాంబ పేరుతో వెలిసిన ఈ గ్రామం అసలు పేరు వేములతోట. కుందమాంబకి వివాహ సమయంలో పసుపు కుంకుమల కింద ఇచ్చిన గ్రామం కుందారం.

**కొడవటంచ :** రేగొండ మండలం గిరిజనులైన చెంచులు కొడవటి అంచులతో అడవిని నరికి నిర్మించుకున్న గ్రామం కాబట్టి దీనికి కొడవటంచ అని పేరు తర్వాత కాలంలో ఇది కోటంచగా మారింది.

ఉగ్రనరసింహుని రౌద్రం తగ్గించేందుకు లక్ష్మీదేవి చెంచులక్ష్మిగా అవతరించడం తెలిసిందే. ఇదే కథ ఇక్కడ ఆలయానికి మూలంగా ప్రచారంలో ఉంది. చెంచులక్ష్మి చెంచుల ఆడపడుచు చెంచులక్ష్మి సమేతుడైన నరసింహుడుగా ఇక్కడ వెలిశారు.

**కొమ్మాల :** కొమ్మాల కొండనే పాండువుల గుట్ట, పాండవుల బోడు అని పిలుస్తారు. (పర్కాల వద్ద మరో పాండవుగల గుట్ట ఉన్నది). పాండవులు పూర్వం ఇక్కడ తపస్సు చేశారట. పాండవులు స్వామి వారికి తోమాల పూజ గావించి ధన్యులైనారట. ఆ కారణంగా తోమాల అనంతర కాలంలో కోమాల, కోమ్మాలగా మారి గ్రామమైయింది. కొమ్మాల జాతర వరంగల్ జిల్లాలోనే ప్రశస్తమైన జాతర.

**ధర్మారావు పేట :** ఖానాపూర్ మండలం నిజాముల కాలంలో క్రీ॥శ॥ 1830 ప్రాంతంలో చెన్నారావుపేట దేశముఖ్ అయిన ధర్మారావు 1200 ఎకరాల భూస్వామి. నిజాముల కర్కశపాలనకు ఎదురొడ్డి పేదలకు అండగా నిల్వడంతో ధర్మారావు పట్ల సాటి దేశముఖ్‌లు ధ్వజమెత్తారు. కాళీభక్తుడు, పేదలపట్ల దయాదాక్షిణ్యలు గల ధర్మారావు వారిని లెక్కచేయక పేదరైతులకు, రైతుకూలీలకు బాసటగా నిలిచాడు. తద్వారా నిజాంకు శత్రువైనాడు నిజాంకు వ్యతిరేకంగా ఏద ప్రజల అండతో పోరాటం సాగించాడు. చివరకు ఆత్మకూరు దేశ్‌ముఖ్ సాయంతో నిజాం సైన్యం కాళీపూజలో ఉన్న ధర్మారావును చంపింది. పేదల పాలిట పెన్నిధి అయిన ధర్మారావు త్యాగానికి గుర్తుగా ధర్మారావు పేటగా ఆ ఊరు గుర్తింపు పొందింది.

**ఖిలాషాపూర్ :** రఘునాథపల్లి మండలం, సర్దార్ పాపన్న షాపూరు గ్రామంలో ఒక ఖిలా (కోట) నిర్మించాడు. అప్పటి నుండి ఈ గ్రామం ఖిలాషాపూర్‌గా చారిత్రక ప్రసిద్ధి పొందింది. క్రీ.శ. 1680-1710 ప్రాంతంలో పాపన్న అనే తెలుగువీరుడు విజృంభించి వరంగల్ పరిసర ప్రాంతాలనే గాక, ఏడు రోజులపాటు గొలకొండనే పాలించినట్లు కథలు ఉన్నాయి. షాపురం కేంద్రంగా పాలన జరగడంతో ఇక్కడ శత్రుదుర్భేద్యమైన ఖిలాను నిర్మించుకున్నాడు. అనాటి స్థల దుర్గాల్లో ఇది ప్రసిద్ధమైది.

**గణపురం :** ఘనపురం 'అని నేడు పిలువబడుతున్న ఈ గ్రామ ప్రాచీన నామం 'గణపురము' గణపతి దేవ చక్రవర్తి కాలంలో, ఆయన పేర నిర్మించబడినది కనక గణపురము అనే పేరు వచ్చింది. ఇక్కడ అనేక ఆలయాలు కట్టించినట్లు ఏకామ్రనాథుని 'ప్రతాపచరిత్ర'లో కన్పిస్తుంది.

**జాఫర్‌గడ్ / వేల్పుగొండ :** పూర్వం వేల్పుగొండగా పిలువబడ్డ ప్రాంతం నేడు జఫర్‌గడ్‌గా ప్రసిద్ధి, వరంగల్‌కు 30–35 కి.మీ. దూరం. నిజాముల పాలనలో 'జాఫర్ ఉద్దౌలా' ఈ పాంపాలకుడుగా ఉన్నప్పుడు ఇక్కడ ఒక ఖిలా నిర్మించాడు. అప్పటి నుండి జాఫర్‌గడ్‌గా ప్రసిద్ధి.

**ఆధార గ్రంథాలు :**

వరంగల్ జిల్లా సర్వస్వం గంజి వెంకటరత్నం)

తెలంగాణ చరిత్ర సుంకిరెడ్డి నారాయణ రెడ్డి

ఆంధ్రప్రదేశ్ సాహిత్య చరిత్ర – మాడపాటి హనుమంతరావు